సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



అమ్మకు సాయం

మతిస్థిమితం లేని ఓ మహిళకు పురిటి నొప్పులు వచ్చాయి. మహిళలంతా కలిసి ప్రసవం చేశారు.

- 8లో



నిలకడగా వంశధార

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఆదివారం రాత్రి సమయానికి 7196 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా సోమవారం నాటికి 10309 క్యూసెక్కులకు పెరిగింది. బ్యారేజీలో 37.67 మీటర్ల నీటి మట్టం ఉంది.

కోరుకుపోతున్న గట్టు

హిరమండలం: వంశధారకు వరదలు సంభవించే సమయంలో వచ్చే నీటి ప్రవాహానికి వంశధార గొట్టా బ్యారేజ్ దిగువ కుడి ప్రాంతంలో వంద మీటర్ల దూరంలో వరద గట్టు కోతకు గురవుతోంది. ఇది మరింత కోతకు గురైతే ముప్పు తప్పదు. గట్టు పూర్తి స్థాయిలో కోతకు గురైతే పంట పొలాలు మునిగిపోవడంతో పాటు హిరమండలం నుంచి బ్యారేజీ మీదుగా పాతపట్నం, శ్రీముఖలింగం రాకపోకలకు ఆటంకం కలుగుతుంది.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు హాసిని



జాతీయ స్థాయి ఖేలో ఇండియా తైక్వాండో పోటీలకు ఎంపికైన టెక్కలికి చెందిన హాసిని

టెక్కలి: తమిళనాడు దిండిగల్‌లో ఈ నెల 11 నుంచి 14 తేదీ వరకుజరగనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా తైక్వాండో పోటీలకు టెక్కలి ఎన్‌టీఆర్ క్రీడా వికాస కేంద్రానికి చెందిన రౌణగల హాసిని ఎంపికైనట్లు కోచ్ ఎస్.శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు.

33 శాతానికిపైగా నష్టం కనిపిస్తేనే ఇన్‌పుట్ సబ్సిడీ



సుసరాం వద్ద మునిగిన వరి పంటలను పరిశీలిస్తున్న జేడీ తదితరులు

పోలాకి(నరసన్నపేట): అధిక వర్షాలకు వరి పంట ఎక్కడైతే 33 శాతం కంటే ఎక్కువగా నష్టం జరుగుతుందో ఆయా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపిస్తామని వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్ తెలిపారు. మండల పరిధిలోని ప్రియాగ్రహారం, డీఎల్‌పురం, సుసరాంలో ఆయన సోమవారం శాస్త్రవేత్తలతో కలిసి ముంపు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామాల్లో గత నెలలో కురిసిన వర్షాలకు నీట వరి పొలాలు మునిగాయని కొద్ది రోజుల్లోనే నీరు బయటకు వెళ్లిపోయిందని అన్నారు. అవే పొలాలు ఇప్పుడు మళ్లీ నీట మునిగాయని అన్నారు. ఈ వర్షం నీరు వెళ్లకపోతే పంటకు నష్టం జరిగే అవకాశం ఉంటుందని, వ్యవసాయ శాఖ సిబ్బంది వచ్చి నష్టాలను అంచనా వేస్తారని అన్నారు. 33 శాతానికి పైబడి వరి పంట నష్ట పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందని దీనికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. అలాగే క్రాప్ ఇన్సూరెన్స్ పంట కోత ప్రయోగాలు పూర్తయిన తర్వాత వాటి దిగుబడి ఆధారంగా రైతులకు వస్తుందన్నారు. దీన్ని రైతులు గమనించాలని కోరారు.

పంట పొలాలు మునక



తురకపేట వద్ద కడపలవాని గెడ్డపై పెరిగిన వరదనీటి ప్రవాహం

ఎల్.ఎన్.పేట: రెండు, మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలం ఎటు చూసినా జలమయంగా మారిపోయింది. సోమవారం ఉదయానికే తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్య కడపలవాని గెడ్డపై వరదనీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో దబ్బపాడు, వాడవలస, తురకపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో ఉన్న సుమారు మూడు వేల ఎకరాల్లోని పంట పొలాల్లో నీరు చేరింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిస్తే పంట పొలాలు నీటి మునిగిపోతాయని రైతులు చెబుతున్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కోవిలాం కాలనీ వద్ద ఎబీ (అలికాం-బత్తిలి) రోడ్డు మీద నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. కాలనీలోని లోతట్టుగా ఉన్న ఇళ్లల్లోని వరదనీరు చేరిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రైతుల కోసమే ఆడ దూడల ఉత్పత్తి పథకం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆడదూడల ఉత్పత్తి పథకాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలని పశుగణాభివృద్ధి కార్యనిర్వహణాధికారి డాక్టర్ నంబాళ్ల దామోదరరావు సూచించారు. రైతులకు కావాల్సిన మేలైన ఆడదూడలు 90 శాతం కచ్చితత్వంతో పుట్టడంతో పాటు పాల దిగుబడి ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ మేలు జాతి ఆడదూడలను పుట్టించడం ద్వారా గ్రామాల్లో మేలు జాతి పశు సంపదను త్వరితగతిన అభివృద్ధి చేయడంతో పాటు లింగనిర్ధారణ వీర్యం సాంకేతికతను రైతుల దగ్గరకు చేర్చడం, సబ్సిడీ ద్వారా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. లింగనిర్ధారిత వీర్యంపై ఆసక్తిగల పశుపోషకులు అందరూ ఈ పథకానికి అర్హులేనని తెలిపారు. ఆరోగ్యవంతమైన ఎలాంటి గర్భకోశ వ్యాధులు లేని పశువులను మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. తక్కువ ధరతో ఎక్కువ లాభం చేకూర్చే వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయన్నారు.



ఈ అపరాధ రుసుం చలానా చూడండి. ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే ఎల్‌ఎన్‌పేట మండలం యంబరాం ఎండీయూ(మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) వాహనంపై జూలై ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ చేసిన సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మ ఉందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఫిర్యాదు మేరకు విధించిన రూ.1000 అపరాధ రుసుం చలానా ఇది. అధికారంలోకి వచ్చి నెల రోజుల కాక ముందే అప్పటికే ఉన్న మాజీ సీఎం ఫొటో తీయలేదనే ఒక్క కారణంతో పనిష్మెంట్ ఇచ్చారు. ఏదో తప్పు చేసినట్టు ఆ ఆపరేటర్‌కు ఫైన్ విధించి మన అధికారులు తమ స్వామిభక్తిని ప్రదర్శించారు. ఒక మాజీ సీఎం ఫొటో ఉందని క్రమశిక్షణ చర్యల కింద రూ.1000 అపరాధ రుసుం విధించడం చరిత్రలో ఇదే తొలిసారేమో.




పింఛన్ల పంపిణీ సమయంలో ఎండీయూ వాహనంపై మాజీ సీఎం ఫొటో ఉందన్న అక్కసుతో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చేసిన ఫిర్యాదు మేరకు అదే రోజున ఆపరేటర్‌కు జారీ చేసిన మెమో ఇది. విధుల్లో నిర్లక్ష్యం వహించారని, సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ నోటీసు జారీ చేశారు. ఎమ్మెల్యే గోవిందరావు ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించిన మేరకు మెమో జారీ చేసినట్టుగా నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వుల వరకు విధులకు హాజరు కావద్దని స్పష్టం చేశారు.



ఎమ్మెల్యే గోవిందరావు ఆదేశాల మేరకు అధికారులు జారీ చేసిన నోటీసుకు సంబంధిత యంబరాం ఎండీయూ ఆపరేటర్ ఇచ్చిన వివరణ ఇది. మాజీ సీఎం ఫొటోపై కాగితాలు కప్పామని, అవి తడిచి ముద్దవడంతో అంటించిన కాగితాలు పోయాయని, అంతేకాకుండా ప్రభుత్వం తరఫు నుంచి స్టిక్కర్లు తొలగించమని ఎలాంటి ఆదేశాలు అందకపోవడంతో సీరియస్‌గా వ్యవహరించలేదని అధికారులకు ఇచ్చిన ఈ వివరణలో పేర్కొన్నారు.

బొమ్మ తీయలేదని చూపిస్తున్నారు!





అపరాధ రుసుం చెల్లించాక యంబరాం ఆపరేటర్‌కు వర్క్ ఆర్డర్ ఇవ్వమని ఆదేశిస్తూ ఎల్‌ఎన్‌పేట తహసీల్దార్‌కు టెక్కలి ఆర్డీవో జారీ చేసిన ప్రొసీడింగ్ ఇది. లిఖిత పూర్వకంగా జరిగిన వ్యవహారం కావడంతో సమస్య పరిష్కారమైందని అంతా భావించారు.

- ఎండీయూ ఆపరేటర్‌పై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కక్ష సాధింపు
- ఎండీయూ వాహనంపై మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటో ఉందని ఆపరేటర్‌ను తప్పించిన ఎమ్మెల్యే
- బొమ్మ తీయనందుకు ఆపరేటర్‌కు రూ. 1000 జరిమానా
- అపరాధ రుసుం చెల్లించినా ఆగని ఎమ్మెల్యే వేధింపులు
- వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా అడ్డు తగులుతున్న పరిస్థితి
- ఒకవైపు తొలగించకుండా, మరోవైపు సస్పెండ్ చేయకుండా అధికారుల తాత్సారం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఒక చిరు ఉద్యోగిపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అండ్ అధికార బృందం కలిసి ఆడిన హైడ్రామా ఇది. మాజీ సీఎం జగన్ ఫొటో ఉందనే నెపంతో ఆ ఆపరేటర్‌కు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నారు. తప్పు చేశారని చెప్పి అపరాధ రుసుం వసూలు చేశాక మళ్లీ వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా తిప్పుతున్నారు. ఇదంతా కుట్ర పూరితంగా చేస్తున్నారు. సాధారణంగా ఏ ఉద్యోగి పైనైనా తప్పు చేశారనుకుంటే సస్పెండ్ చేస్తారు, లేదంటే ఉద్యోగం నుంచి తీసేస్తారు. ఇక్కడ సస్పెండ్ చేయకుండా, తొలగింపునకు పాల్పడకుండా గాలిలో పెట్టి డ్రామాలాడుతున్నారు. సస్పెన్షన్, డిస్మిస్ చేస్తే ఎక్కడ కోర్టుకెళ్లి ఇబ్బంది పెడతారనే అభిప్రాయంతో అబియేన్స్‌లో పెట్టి ఇబ్బంది పెడుతున్నారు. అటు పనిచేసుకునే విధంగా వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా, మరో వైపు అధికారికంగా చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తూ గాలి వ్యవహారం నడుపుతున్నారు. దీని కంతటికీ ఎమ్మెల్యే మామిడి గోవిందరావే కారణమని తెలుస్తోంది. అధికారులు నిబంధనల మేరకు వ్యవహరించి, అపరాధ రుసుం విధించి, సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినా దానికి ఎమ్మెల్యే ససేమిరా అంటూ మొండికేసి అడ్డుతగలుతున్నారు. దీంతో అధికారులు కూడా ఏం చేయలేక చివరి నిమిషంలో అబియేన్స్ ఆర్డర్ ఇచ్చి తప్పించుకున్నారు. సాధారణ స్థాయి నుంచి పైకొచ్చిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా తన కసిని తీర్చుకుంటున్నారు. ఎమ్మెల్యే తీరుపై జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎండీయూ ఆపరేటర్లు భగ్గుమంటున్నారు.



తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న యంబరాం ఎండీయూ ఆపరేటర్



ఆర్డీవో ప్రొసీడింగ్ ఆధారంగా ఎల్‌ఎన్‌పేట తహశీల్దార్ వద్దకు వెళ్లిన ఆపరేటర్‌కు అందించిన అబియేన్స్ ఆర్డర్ ఇది. తాను ముందు ఇచ్చిన ప్రొసీడింగ్‌ను తదుపరి ఉత్తర్వుల వరకు అబియేన్స్‌లో పెట్టాలని పేర్కొని ఉండటంతో తహసీల్దార్ చేతులెత్తేశారు.

చలానాలు నిజం.. చక్కబెట్టేశాక రద్దు నాటకం!




కోటబొమ్మాళి మండలం రేగులపాడు వినాయక మండపం ఏర్పాటు అనుమతికి తీసిన రూ. 950 చలానా



వసూలు వాస్తవం..

కోటబొమ్మాళి మండలం రేగులపాడులో నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో మండపానికి రోజుకి రూ.100 చొప్పున తొమ్మిది రోజులకు గాను రూ. 900, మీ సేవ సర్వీసు చార్జీ రూ.50 కలిపి మొత్తం రూ.950లు చెల్లించిన చలానా ఇది. ఈ చలానా పట్టుకుని వెళ్తే తప్ప మండపం ఏర్పాటుకు అనుమతివ్వని పరిస్థితి. సాక్షాత్తు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత మండలంలో తీసిన ఈ చలానా చూస్తే హోం మంత్రి అనిత మాటలన్నీ అబద్ధాలేనని అర్థమైపోతుంది. ఎలాంటి చలానాలు కట్టించుకోవడం లేదని బుకాయించినా అప్పటికే జరగాల్సినదంతా జరిగిపోయింది. అనిత బుకాయింపు తప్ప భక్తులకు ఒరిగిందేమీ లేదని తేలిపోయింది.

- చలానా తీశాకనే వినాయక మండపాలకు అనుమతులు
- రోజుకి రూ. 100చొప్పన ముందే చలానాలు తీసిన నిర్వాహకులు
- గతంలో లేని పరిస్థితులను చూశామంటున్న భక్త సంఘాలు
- చలానాలన్నీ కట్టేశాక.. ఎక్కడా వసూలు చేయలేదని హోం మంత్రి అనిత వ్యాఖ్యలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వినాయక చవితికి ముందు.. హోంమంత్రి వంగలపూడి అనిత ఆ మధ్య ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి వినాయక మండపాలకు సింగిల్ విండో సిస్టంలో అనుమతులు తీసుకోవాలని మైక్ సెట్టుకు ఇంత, విగ్రహం పొడవు మేరకు ఇంత అని రేట్లు చదివి వినిపించారు. అదంతా రికార్డు అయింది. మీడియాలో కూడా వచ్చింది.

వినాయక చవితి పర్వదినం తర్వాత.. హోంమంత్రి అనిత ప్రకటనపై హిందూ భక్తులు, సంఘాలు తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి. వినాయక మండపాలకు చలానాలు తీయడమేంటని నిలదీశాయి. సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వ తీరును, హోంమంత్రి అనిత వైఖరిని దుయ్యబట్టాయి.

ప్రభుత్వానికి అప్రతిష్ట వచ్చిందని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అనితతో మాట మార్పించారు. తాను అసలు చలానా తీయమని చెప్పలేదని, ఎక్కడ డబ్బులు వసూలు చేయడం లేదని ఏ ఒక్కరూ చెల్లింపులు చేయనక్కర్లేదని ఈ నెల 8వ తేదీన మళ్లీ మీడియా సమావేశం పెట్టి అనిత బుకాయించారు. జరుగుతున్న ప్రచారమంతా అవాస్తవమని ఎదురు దాడికి దిగారు. వినాయక చవితి ఉత్సవాలకు ముందే మండపాల అనుమతికి చలానాలు చెల్లించడం జరిగిపోయింది. చలానాలు తీస్తే తప్ప అనుమతులిచ్చే పరిస్థితుల్లేకపోవడంతో నిర్వాహకులంతా తప్పని పరిస్థితుల్లో చలానాలు తీసి మండపాలు ఏర్పాటు చేసుకున్న పరిస్థితి చోటు చేసుకుంది. చలానాలు తీయకపోతే ఎక్కడ మండపాల ఏర్పాటుకు ఆటంకం కలిగిస్తారోనని ప్రభుత్వం చెప్పినట్టుగా జిల్లా వ్యాప్తంగా చలానాలు తీశారు. ఎన్ని రోజులకైతే అన్ని రోజులకు ప్రభుత్వం నిర్దేశించిన సొమ్ము చెల్లించారు. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 1500 వరకు మండపాలకు చలానాలు తీశారు. హోంమంత్రి మాట మార్చిన ప్రకటన తర్వాత అధికార వర్గాలు కూడా అప్రమత్తమై చలానాల సంఖ్య చెప్పకుండా గోప్యత పాటించాయి. 6వ తేదీకి ముందు వరకు చలానాలు కట్టారని, ఆ తర్వాత చలానాలు కట్టలేదని, కట్టిన చలానాలకు సొమ్ము వెనక్కిచ్చే పరిస్థితి లేదని అధికార వర్గాలు సూచన ప్రాయంగా చెబుతున్నాయి. జరిగిపోయిన దానికి చేసేదేమి లేదని, జరగాల్సిన దానిపై అప్రమత్తమై, చలానాల జోలికి పోలేదని సమర్థించుకుంటున్నాయి.

వెనక్కి ఇచ్చేస్తారా?

హోంమంత్రి ముందొక ప్రకటన చేసి, భక్తుల నుంచి వ్యతిరేకత ఎక్కువవడంతో మాట మార్చారు. పోనీ, మార్చిన మాట ప్రకారం చెల్లించిన చలానా సొమ్ము వెనక్కి ఇచ్చేస్తారా? అని భక్తులు నిలదీస్తూ డిమాండ్ చేస్తున్నారు. చేయాల్సినదంతా చేసేసి...అంతా అయిపోయాక ఏమీ వసూలు చేయలేదు...అంతా తూచ్ అనేస్తే సరిపోదని భక్త సంఘాలు అంటున్నాయి. గతంలో ఎప్పుడూ చూడని పరిస్థితిని ఈసారి చూశామని మండపాల నిర్వాహక సంఘాలు మండిపడుతున్నాయి.

వసూళ్లు దారుణం..



గణేశ్ ఉత్సవాలకు నిర్వాహకుల నుంచి ప్రభుత్వం చలానా వసూలు చేయడం దారుణం. మాఊరిలో యువకులంతా కలిసి గణేష్ ఉత్సవాలు చేసేందుకు మండపం నిర్మించాం. ఈనెల 6వ తేదీకి పోలీసులు వచ్చి తప్పనిసరిగా గణేష్ ఉత్సవాలకు 9 రోజులకు మీసేవ కేంద్రాల్లో చలానా తీయాలని చెప్పారు. అప్లికేషన్‌తో పాటు చలానాను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని చెప్పారు. హోం మినిస్టర్ అనిత మీడియాలో చలానా చెల్లించనక్కర్లేదని చెప్పడం మోసం చేయడమే.

– దండాసి సింహాచలం, వినాయక ఉత్సవకమిటీ మెంబర్, పాకివలస గ్రామం, కోటబొమ్మాళిమండలం

● విభిన్న గణపతి

గణపతి నవరాత్రులు జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా జరుగుతున్నాయి. విభిన్న రూపాల్లో సృజనాత్మక పందిళ్లలో స్వామిని ప్రతిష్టించారు. మూడో రోజైన సోమవారం పలు చోట్ల నిమజ్జనోత్సవాలు నిర్వహించారు.

– టెక్కలి, శ్రీకాకుళం కల్చరల్



టెక్కలి శ్రీనివాస నగర్‌లో గుహలో వినాయకుడు(ఇన్‌సెట్‌ల) శ్రీకాకుళం రైతుబజారు వద్ద గల 18 అడుగుల గణపతి విగ్రహం

వాన తగ్గింది. కానీ వరద మాత్రం లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. ముఖ్యంగా నాగావళి, వంశధార, మహేంద్ర తనయ నదుల పరివాహక ప్రాంతాల్లో పొలాలు నీట మునిగాయి. గెడ్డలు, ఏర్లు పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారుల అంచనా ప్రకారమే వెయ్యి ఎకరాలకుపైగా పంట నీటిపాలైంది. పదుల సంఖ్యలో పూరిళ్లు కూలిపోయాయి. విద్యుత్ శాఖకు స్వల్పంగా నష్టం వాటిల్లింది.



వరద భయం

● తగ్గిన వాన



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ సీజన్‌లో ఇప్పటివరకు అధిక వర్షాలు పడ్డాయి. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కనిపించాయి. ఆగస్టులోనూ సాధారణ వర్షపాతమే నమోదైంది. గడిచిన వారం రోజులుగా పడిన వానకు చెరువులు, వాగులు నిండాయి. సోమవారానికి వానలు తగ్గుముఖం పట్టాయి. మొత్తం 1598.4 మిల్లీమీటర్ల వాన కురవగా.. సగటున 53.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగావళి, వంశధార, మహేంద్ర తనయ నదుల పరివాహక ప్రాంతాల్లో పంట నష్టం జరిగింది.

ఇటీవల కురిసిన వానలు(మిల్లీమీటర్లలో)

తేదీ	కురిసిన వర్షం	సగటు వర్షం
సెప్టెంబర్ 4	157.6	5.3
సెప్టెంబర్ 5	36.2	1.2
సెప్టెంబర్ 6	307.8	10.3
సెప్టెంబర్ 7	142.4	4.7
సెప్టెంబర్ 8	1461	48.7
సెప్టెంబర్ 9	1284.8	43.0



కవిటి: కుసుంపురంలో పొలాల్లోకి చేరిన నీరు

● రెల్లిగెడ్డ ఉగ్రరూపం

పొందూరు: మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రెల్లిగెడ్డ ఉగ్రరూపం దాల్చింది. ముఖ్యంగా లైదాం గ్రామం వద్ద వంతెనపై వరద నీరు ప్రవహిస్తుండటంతో సంతకవిటి మండలం-పొందూరు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మొదలవలస, గోకర్నపల్లి వద్ద వరదనీరు వంతెన పై నుంచి ప్రవహిస్తోంది. వందలాది ఎకరాల వరి పంట నీటిమునిగిపోయింది.

● మహేంద్రతనయ పరిశీలన

మెళియాపుట్టి: నదీ తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని టెక్కలి వంశధార ఈఈ శేఖర్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని రట్టిణి గ్రామానికి ఆనుకుని ఉన్న మహేంద్రతనయ నదిని పరిశీలించారు. ఒడిశాలో వర్షాలు అధికంగా కురిస్తే రట్టిణి, నడసంద్ర గ్రామాలకు వరద ముప్పు ఉంటుందని హెచ్చరించారు.

● అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : వర్షాలు తగ్గుముఖం పట్టినా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవోలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒడిశాలో వర్షాలు పడుతున్నందున జిల్లాలోని నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇరిగేషన్ అధికారులతో వంశధార, నాగావళి, బహుదా, మహేంద్ర తనయ నదుల పరీవాహక ప్రాంతాలను అప్రమత్తం చేయాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు ప్రారంభించాలని ఆదేశించారు.



పొందూరు: కొల్లిపేటలో దహన సంస్కారానికి ఇబ్బందులు

38 పూరిళ్లు నేలమట్టం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లోకి నీరు చేరింది. ఇటీవల వర్షాల వల్ల 38 పూరిళ్లు కూలిపోయాయి. నాగావళి, వంశధార, మహేంద్రతనయ పరివాహక ప్రాంతాల్లో సుమారుగా 1223 హెక్టార్లలో పంట నీట మునిగింది.

ఆమదాలవలస, సారవకోట: భారీ వర్షాలతో వెంగళరావు కాలనీకి చెందిన బడిగింటి సావిత్రమ్మకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. అదే కాలనీలో నివాసముంటున్న అముజారు జ్యోతి, మేటికోటి సావిత్రమ్మ అనే మహిళలకు చెందిన పూరింటి మట్టి గోడలు కూడా కూలిపోయాయి.

సారవకోట మండలంలో కేశవలస గ్రామానికి చెందిన ముచ్చా కృష్ణవేణి, బద్రి గ్రామానికి చెందిన నెయ్యిల పార్వతిలకు చెందిన ఇంటి గోడలు వర్షాలకు కూలిపోయాయి.



వెంగళరావుకాలనీలో కూలిన ఇంటి గోడ

క్లుప్తంగా

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో ఉన్న ఎన్‌టీఆర్ నైపుణ్య, సాధికారిత మహిళా ప్రాంగణంతో ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ కె.పార్వతి సోమవారం ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణత ఆధారంగా నిర్వహించే నెల వ్యవధి కోర్సు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, 8వ తరగతి ఉత్తీర్ణత ఆధారంగా నిర్వహించే నెల వ్యవధి కోర్సు టైలరింగ్, 8వ తరగతి ఆధారంగా నిర్వహించే 45 రోజుల శిక్షణ కోర్సు మగ్గం వర్కుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అర్హులైన మహిళలు ఈ నెల 15వ తేదీలోపు విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలతో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 8333921337, 9948530183, 7416764419 ను సంప్రదించాలని సూచించారు.

పర్మిట్లు ఇచ్చి ఆదుకోండి



టెక్కలి మైన్స్ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు

టెక్కలి: గ్రానైట్ క్వారీల్లో బ్లాకుల తరలింపునకు పర్మిట్‌లు ఇచ్చి గ్రానైట్ యాజమాన్యం, కార్మికులను ఆదుకోవాలని ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం టెక్కలి మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రానైట్ నిర్వాహణ బాధ్యతలు విశ్వ సముద్ర సంస్థకు కేటాయించినప్పటికీ, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఎలాంటి పర్మిట్‌లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తక్షణమే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పర్మిట్‌లు ఇచ్చే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆశ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: స్థానిక సచివాలయం-3 పరిధిలో ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న సనపల సరస్వతి సోమవారం అధిక మోతాదులో మాత్రలు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సరస్వతి తాను విధులు నిర్వహిస్తున్న సచివాలయం పరిధిలోని ఏఎన్‌ఎం వేధింపుల తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం అందించారు.

ఘనంగా 'తంగి' జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : సీనియర్ న్యాయవాది, మాజీ ఆంధ్ర రాష్ట్ర స్పీకర్ తంగి సత్యనారాయణ 94వ జయంతి వేడుకలు జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో డీసీసీ ప్రెసిడెంట్ కిలారి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తంగి ఘనతలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్‌బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాది టి.రాధాకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు సాయం



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వాన జోరుగా పడుతోంది. చినుకుల శబ్దం తప్ప వీధుల్లో మరే ఇతర అలికిడి లేని రాత్రి సమయమది. జనమంతా ఇళ్లలోపలే ఉన్న ఆ వేళ నరసన్నపేట కోమర్తి బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం గడపలో ఓ మహిళ ఏడుపు వినిపించింది. రోదన విన్న ఇరుగు పొరుగు మహిళలు వచ్చి చూస్తే.. ఓ నిండు గర్భిణి ప్రసవ వేదన పడుతోంది. దగ్గరకు వెళ్లి సపర్యలు చేస్తే ఆ గర్భిణికి మతిస్థిమితం లేదన్న సంగతి తెలిసింది. తన కడుపులో ఓ బిడ్డ పెరుగుతోందని, తను అమ్మను కాబోతున్నాననే విషయం కూడా అర్థం కాని స్థితి ఆమెది. ఆశ వర్కర్ సాయంతో స్థానికులే యువతికి ప్రసవం చేశారు.

- కోమర్తి కాలనీలో మతిస్థిమితం లేని మహిళకు పురిటి నొప్పులు
- కాలనీకి చెందిన మహిళల సహకారంతో ప్రసవం చేయించిన ఆశ వర్కర్
- బిడ్డ ఆరోగ్య రీత్యా 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలింపు

నరసన్నపేట: మండలంలోని కోమర్తి బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మతిస్థిమితం లేని ఓ యువతి మగబిడ్డను ప్రసవించింది. కోమర్తి బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం గడపలోనుంచి ఒక మహిళ ఏడుపులు విన్న మహిళలు బయటకు వచ్చి చూస్తే మతిస్థిమితం లేని ఓ యువతి ప్రసవ వేదన పడుతున్నట్లు కనిపించింది. వెంటనే సమీపంలో ఉన్న ఆశ వర్కర్ సరస్వతికి వారు సమాచారం ఇచ్చారు. ఈలోగా నొప్పులు పెరిగాయి. కొద్ది క్షణాల్లోనే మగబిడ్డను ప్రసవించింది. అయితే బిడ్డ పుట్టిన వెంటనే ఏడ్చి తర్వాత కదలిక లేకపోవడంతో ఆశ వర్కర్ స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు 108 వాహనాన్ని తీసుకువచ్చి రాత్రి వేళ ఆస్పత్రికి తరలించారు. నవజాత శిశువు నెలలు నిండకుండానే జన్మించిందని, బరువు తక్కువగా ఉందని మరో మూడు రోజులు ఆస్పత్రిలోనే ఉంచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు తెలిపారు.

మేము పెంచుకుంటాం..

ఈ సమాచారం బయటకు వెళ్లడంతో నవజాత శిశువును పెంచుకుంటామని పలువురు ముందుకు వచ్చారు. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకే తప్ప ఇలా ఎవరికి వారు తీసుకుని వెళ్లడం జరగదని జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ సీతారాం అన్నారు. సమాచారం తెలుసుకున్న ఆయన ఆస్పత్రికి వచ్చి నవజాత శిశువు గురించి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ మూడేళ్ల కిందట ఇలానే పోలాకి మండలంలో ఈ అమ్మాయి ఒక మగబిడ్డను ఇలానే ప్రసవించిందని తాము సంరక్షించి ఆ బిడ్డను దత్తత ఇచ్చామన్నారు. శిశువును శ్రీకాకుళం శిశు గృహకు తరలించారు. అంతకుముందు సమాచారం తెలుసుకున్న నరసన్నపేట సీఐ జె. శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌లు ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. రాత్రి నుంచి సపర్యలు చేసిన సరస్వతిని పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు, బాలల రక్షణ విభాగం సిబ్బంది అభినందించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవజాత శిశువు

నిమజ్జనోత్సవానికి సన్నద్ధం

- శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో నిమజ్జన పాయింట్ల గుర్తింపు

శ్రీకాకుళం క్రైమ్ : సబ్ డివిజన్ పరిధిలో ఉన్న శ్రీకాకుళం (రూరల్) వన్‌టౌన్, టూటౌన్, జె.ఆర్.పురం, ఆమదాలవలస సర్కిళ్లలో గణేశుని నిమజ్జనోత్సవానికి పోలీసు బందోబస్తు సిద్ధంగా ఉందని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1055 చిన్న, పెద్ద విగ్రహాల అనుమతులు నిర్వాహకుల నుంచి వచ్చాయని, వీటిలో 295 వరకు పెద్ద విగ్రహాలున్నాయన్నారు. సోమవారం 96 విగ్రహాలు నిమజ్జనం చేయాల్సి ఉన్నా వర్షాభావ పరిస్థితుల వలన 73 విగ్రహాలు నిమజ్జనం అవుతున్నాయని అన్నారు. ఇప్పటికే 21 నిమజ్జన పాయింట్లను గుర్తించి ఆ ప్రాంతాల్లో ఆ పరిధి పోలీసులు బందోబస్తు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఊరేగింపు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా గ్రామస్తులు సహకరించాలని కోరారు. వర్షాల వల్ల వాగులు, చెరువులు, నదులు పొంగి పొర్లడంతో సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల్లోపు నిమజ్జనం పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసుకుంటే మంచిదని తెలిపారు. మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనకూడదని, ఆ సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు బుక్ చేస్తామని పేర్కొన్నారు.

పాయింట్లు ఇవే..

- **శ్రీకాకుళం** : డేఅండ్‌నైట్ నాగావళి కొత్త బ్రిడ్జి, పీఎన్‌కాలనీ-ఓబీఎస్ పాత బ్రిడ్జి, పొన్నాడ వంతెన, అరసవల్లి మిల్లు జంక్షన్ చెరువు, సింగుపురం చెరువు, పెద్దపాడు రామిగెడ్డ (వంశధార కెనాల్)
- **గార** : తండ్యాల్‌పేట బీచ్ రెండు పాయింట్లు, బందరువానిపేట బీచ్, గాబువానిపేట ట్యాంకు
- **జె.ఆర్.పురం:** లావేరు, పొన్నాడ బ్రిడ్జి, కృష్ణాపురం ట్యాంకు
- **ఆమదాలవలస:** చీమలవలస గెడ్డ, మండడ చెరువు, జివాంబిపేట చెరువు, కొరకాం గెడ్డ, మంగళి చెరువు, కృష్ణాపురం చెరువు, తొగరాం (నాగావళి నది)



పొన్నాడ వంతెన వద్ద భద్రతా ఏర్పాట్ల గురించి చర్చిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

- ధర్మవరం, దల్లావలస, పెనుబర్తి
- **సరుబుజ్జిలి** : పాలవలస, బొర్రంపేట

నియమాలు పాటించాల్సిందే: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : నాగావళి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయాల్లో భక్తులు నియమాలు పాటించాలని, అధికారులు ఆ ప్రదేశాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయం మార్గంలో ఉన్న పొన్నాడ వంతెన ఇరువైపులా వినాయకుని నిమజ్జన ప్రదేశాలను డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపునాయుడులతో కలిసి సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ పొన్నాడ వంతెన, డేఅండ్‌నైట్ కొత్త బ్రిడ్జి, ఏడురోడ్ల కూడలి-గుజరాతీపేట పాత వంతెన వద్ద నిమజ్జన ప్రదేశాల్లో ఇతర విభాగాల సమన్వయంతో లైటింగ్స్, క్రేన్లు, లైఫ్‌బోట్స్, అంబులెన్సు, బారికేడ్లు, గజ ఈతగాళ్లు, ఫైర్ విభాగం, అవసరమయ్యే సిబ్బందిని ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. వాగులు, కాలువలు, నదుల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భక్తులెవరూ విగ్రహాలను స్వతహాగా నిమజ్జనం చేయరాదని, క్రేన్లు, గజ ఈతగాళ్ల సాయంతో చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో చిన్నపిల్లలను, మద్యం సేవించిన వారిని నిమజ్జన ప్రదేశాలకు తీసుకురాకూడదని, అనుమతులు లేని చోట నిమజ్జనం చేయరాదని, ప్రశాంతంగా దైవ కార్యక్రమం ముగించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, ఇమ్మాన్యుయేల్ రాజు ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఇచ్చే హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ నందు 17వ బ్యాచ్ ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అతను మాట్లాడుతూ ఉద్యోగ అనువతి చాలా కష్టతరమైనదన్నారు. మన కెరీరులో చాలా అవకాశాలు నమస్కరించి ఉంటున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలన్నారు. నెలలో జాల పాఠం క్రమశిక్షణతో నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1,2 డిపో మేనేజర్‌లు పి.మల్లికార్జునరావు, కేఎస్ఆర్ శర్మ, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్‌లు వి.రమేష్, ఎ.గంగరాజు, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు. నెల రోజులు తర్వాత 18వ బ్యాచ్‌ను ప్రారంభిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు 7382923293, 7095040608, 73829 17289 నంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.



డ్రైవింగ్ శిక్షణ పుస్తకాన్ని శిక్షణ అభ్యర్థికి అందజేస్తున్న ఆర్టీసీ మేనేజర్

స్నేహంగా నటించి.. రూ.50వేలకు టోపీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పురుషోత్తపురంలో వ్యక్తిని మోసగించి రూ.యాభై వేలు కాజేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే నందిగాం మండలం పెద్దతామరాపల్లి గ్రామానికి చెందిన గుంటు సింహాచలం పురుషోత్తపురంలోని తన అత్తవారి ఇంటికి రాగా.. జీడిపిక్కలపొమ్ము కూడలి వద్ద ఓ వ్యక్తి స్నేహంగా పరిచయం పెంచుకుని సింహాచలం ఫోన్ నుంచి రూ.50 వేల ఫోన్ పే చేయించుకుని ఒక్కసారి ఫోన్ ఇవ్వు వచ్చాపో యాడు. అనంతరం ఆ ఫోన్ నంబర్‌ను సంప్రదించగా స్విచ్‌ఆఫ్ రావడంతో లబ్ధిదారుడు లబోదిబోమని స్థానిక యూనియన్, ఎస్‌బీఐ బ్రాంచ్‌లను సంప్రదించారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని అక్కడ వివరాలు తీయగా వారు చెప్పడంతో బాధితుడు కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించాడు.

ఓబీసీ సాధించే వరకు ఉద్యమం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): క్షత్రియకులాలు ఓబీసీ సాధించేవరకు ఉద్యమం కొనసాగిస్తామని రాష్ట్ర క్షత్రియ సంఘం (63/79) అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో సోమవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు ఓబీసీ ప్రయత్నంలో భాగంగా పలుమార్లు ఢిల్లీ వెళ్లామన్నారు. కార్యవర్గ సూచన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మండల సంఘాలు, జిల్లా సంఘాలు ఎన్నికలు నిర్వహించి నిర్ధిష్టమైన ఓటరు జాబితా తయారైన తర్వాత రాష్ట్ర ఎన్నికలు నిర్వహిస్తామని ఉమామహేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి.జయబాబు, అడ్మిన్ కార్యదర్శి సదాశివుని కృష్ణ, ఉపాధ్యక్షుడు బి.సుధాకర్, ప్రభాకర్‌రాజ్, సత్యప్రసాద్, పీటీ టి.రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తూ గత నెలలో మరణించిన టి.కాంతారావు కుటుంబ సభ్యులకు తోటి సహచరులు తమ ఒక్కరోజు వేతనాన్ని అందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తన చేతుల మీదుగా రూ. 4.13 లక్షల నగదు చెక్కును హోంగార్డు కాంతారావు కుటుంబీకులకు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ కాంతారావు మరణం బాధాకరమని, కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటరమణ, తదితరులున్నారు.



చెక్కును అందజేస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఓ ఏటీఎం చోరీకి దుండగుడు ఆదివారం అర్ధరాత్రి విఫలయత్నం చేశాడు. కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేస్తుండగా.. ఎస్‌బీఐ పర్యవేక్షకులకు అలారం మోగింది. దీంతో వారు పోలీసులను అప్రమత్తం చేశారు. పోలీసులు వెంటనే స్పాట్‌కు వెళ్లారు. అయితే పోలీసు జీపు సైరన్ విన్న ఆ వ్యక్తి సందులోంచి పారిపోయాడు. అక్కడికి వెళ్లి చూసేసరికి ఏటీఎం బాక్స్ దగ్గర ఉండే ఆన్‌లైన్ కనెక్షన్ వైర్లు తెగి ఉన్నాయి. దొంగతనం చేసిన వ్యక్తి టెక్నీషియన్ అయి ఉండాలని, వైర్లు కట్ చేసి బాక్సును తెరిచి అందులో ఉన్న నగదును చోరీ చేసేందుకు ప్రయత్నించి ఉండాలని భావిస్తున్నారు. ఏటీఎం వద్ద సీసీ పుటేజీని పరిశీలించగా బాక్స్ పైనుంచి వ్యక్తి వైర్లను కట్ చేస్తున్న దృశ్యం కనిపించింది. బయట కూడా సందులో పారిపోతున్నట్లుగా సీసీ పుటేజీలో నిక్షిప్తమై ఉంది. అదే సమయంలో టూటౌన్ సీఐ గుండు మోహన ఉమామహేశ్వరరావు నైట్‌రౌండ్లో ఉండటంతో హెచ్‌సీ రవి చోరీ యత్నానికి సంబంధించి వివరాలు చెప్పారు.



రాత్రి 1:26 గంటలకు ఏటీఎం బాక్సుపై కూర్చొని వైర్లు కట్ చేస్తున్న ఆగంతకుడు

మృతుడి కుటుంబానికి రూ. 5లక్షలు అందజేత

ఆమదాలవలస: అచ్యుతాపురం సెజ్‌లో గల ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన విస్ఫోటన ఘటన 17 కుటుంబాల్లో అంతులేని ఆవేదనను మిగిల్చిందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదే ప్రమాదంలో మృతి చెందిన ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన రూ.5లక్షల చెక్కును మృతుని తండ్రి ధర్మారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఆపన్న హస్తం అందించేందుకు మాజీ సీఎం ముందుకు వచ్చారన్నారు. మృతిచెందిన వ్యాక్తికి రూ.ఐదు లక్ష లు, ప్రమాదంలో బారిన పడిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారని తెలిపారు. మిగిలిన రాజకీయ పార్టీలు కూడా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించాలన్నారు.

17 ప్రాణాలను పొట్టన పెట్టుకున్న కంపెనీ యాజమాన్యంపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించకపోవడం హేయమన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కోట గోవిందరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, వైస్ ఎంపీపీ మానుకొండ వెంకటరమణ, స్థానిక ఎంపీటీసీ తాండ్ర ధనుంజయరావు, పార్టీ నాయకులు బెండి హరినాథ్, బెండి జయరాం, వసంత, తమ్మినేని వేణు, ఎన్ని రామచంద్రయ్య, గురుగుబెల్లి అప్పలనాయుడు, కుబిటిఫ్రెల్ల నన్నాసిరావు, మన్మధరావు, చంద్రయ్య బొడ్డేపల్లి అనిల్, కింతలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రూ.5లక్షల చెక్కును మృతుని తండ్రి ధర్మారావుకు అందజేస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

యువకుడు అనుమానాస్పద మృతి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామ మధ్యలో గల మద్యం షాపుల ఎదురుగా కొలనులో బంగారుపుడు(25) అనే ఓ యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున గ్రామస్తులు గుర్తు తెలియని ఓ యువకుడు మృతి చెంది ఉన్నాడని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించిన తర్వాత మృతుడిని పైడిభీమవరం పారిశ్రామికవాడలో గల ఏపీఐఐసీ ఆరబిందో పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న బంగారుపుడు(చిన్న)గా గుర్తించారు. పాయకరావుపేట మండలంలో గల అల్లడపాలెం గ్రామంలో నివాసం ఉంటున్న తన అక్క గంగ గంగ దగ్గర ఉంటూ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ నుంచి ఇంటికి వెళ్లకుండా నిత్యం మద్యం సేవించి తిరుగుతున్నాడని స్థానికులు, తోటి కార్మికులు తెలిపారు. మృతుడి స్వగ్రామం విజయనగరం జిల్లాలోని బొండపల్లి మండలంలో గల ఒంపల్లి. మృతుని ఒంటిపై చిన్న చిన్న దెబ్బలు ఉండటంతో తన అక్క గంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జేఆర్‌పురం పోలీసులు

25.5 కిలోల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం: ప్రజలు సహకరిస్తేనే గంజాయి, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా అడ్డుకోగలమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద గల పాస్‌పోర్ట్ వద్ద గంజాయిని అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆరుగురు నిందితులను పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ సీఐ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. గంజాయి రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ గంజాయి ఒడిశా నుంచి అక్రమంగా తమిళనాడుకు లారీల ద్వారా రవాణా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి

గంజాయి అక్రమ రవాణాకి పాల్పడిన పట్టణానికి చెందిన బుగ్గ చిరంజీవి, తెలుకల కృష్ణసాహు, బుగ్గ సావిత్రి ఒడిశాలోని పాత్రపూర్ బ్లాక్‌కి చెందిన రబీంద్ర సేఠీ, సింహాచలం సేఠీ, తమిళనాడు రాష్ట్రం తిరువవెల్లి జిల్లా, నెటూరు గ్రామానికి చెందిన రమేష్‌చెయతమ్ లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద గల 25.560 కిలోల గంజాయితో పాటు ఒక ద్విచక్రవాహనం, 7 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా అడ్డుకోవడానికి ఇచ్ఛాపురం, పాతపట్నం, పైడిభీమవరం ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టుల ద్వారా నిత్యం 24/7 తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సబ్‌డివిజన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, స్పెషల్‌బ్రాంచ్ సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజు, సీఐ ఎం చిన్నంనాయుడు, పట్టణ ఎస్ఐ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీస్ శాఖలోకి ఇద్దరు సీఐలు, 15 మంది ఎస్ఐలను బదిలీపై పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి.

సీఐ	ప్రస్తుత స్థానం	బదిలీపై వచ్చేది
వానపల్లి నాగరాజు	వీఆర్ (విశాఖ రేంజ్)	శ్రీకాకుళం ట్రాఫిక్
జి.ఆర్.కె.తులసీదాస్	వీఆర్ (విశాఖ రేంజ్)	శ్రీకాకుళం డీటీసీ ఎస్ఐ
మరడాన హరికృష్ణ	వీఆర్ (శ్రీకాకుళం)	శ్రీకాకుళం 1టౌన్
రెడ్డి జనార్ధనరావు	సీసీఎస్ అనకాపల్లి	గార
కె.కృష్ణప్రసాద్	గార	శ్రీకాకుళం వీఆర్
గొంగాడ నారాయణస్వామి	వీఆర్ (శ్రీకాకుళం)	నౌపడ
పి.కోటేశ్వర్లు	నౌపడ	శ్రీకాకుళం వీఆర్
కూన నేమానారాయబాబు	వీఆర్ (శ్రీకాకుళం)	స్పెషల్ బ్రాంచి
బుడుమూరు నిహార్	సరుబుజ్జిలి	వజ్రపుకొత్తూరు
చామంతుల రామారావు	వజ్రపుకొత్తూరు	శ్రీకాకుళం వీఆర్
పిన్నింటి రమేష్‌బాబు	వీఆర్ (శ్రీకాకుళం)	మెళియాపుట్టి
టి.రాజేష్	మెళియాపుట్టి	శ్రీకాకుళం వీఆర్
వి.సందీప్‌కుమార్	సీసీఎస్ (శ్రీకాకుళం)	ఎచ్చెర్ల
వి.సత్యనారాయణ	వీఆర్ (శ్రీకాకుళం)	కోటబొమ్మాళి
సయ్యద్ మహ్మద్ఆలీ	కోటబొమ్మాళి	నందిగాం
అమీర్ అలీమహ్మద్	నందిగాం	శ్రీకాకుళం వీఆర్
ఎ.కోటేశ్వరరావు	స్పెషల్ బ్రాంచి	శ్రీకాకుళం వీఆర్

మహిళ మెడలో చైన్ చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఆర్‌కే నగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని రెండు తులాల బంగారు గొలుసు (చైన్) లాగేసి పారిపోయాడు దుండగుడు. రెండో పట్టణ సీఐ గుండుమోహన ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. ఆర్‌కే నగర్‌లో నివాసముంటున్న కె.జయలక్ష్మి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ టెక్నికల్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని తన నివాసానికి సోమవారం రాత్రి ఏడుగంటల సమయంలో నడుచుకుంటూ వస్తున్నారు. కరెంట్ ఆఫీసు సమీపంలో వెనుకగా మాస్కు పెట్టుకుని నడుచుకుంటూ వచ్చిన వ్యక్తి ఒక్కసారిగా మెడలోని చైన్‌లాగేసి 20 మీటర్ల వెనక ఉన్న తన ద్విచక్రవాహనం పైన్న పరుగుపెట్టాడు. జయలక్ష్మి దొంగ దొంగ అని అరిచే వచ్చే లోపే బైక్‌పై ఉడాయించేశాడు. చైన్ లాగే క్రమంలో జయలక్ష్మి రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. వెంటనే బాధితురాలు జయలక్ష్మి 100కు డయల్ చేయడంతో ఘటన స్థలికి సీఐ వెళ్లి పరిసర ప్రాంతాల్లో సీసీ పుటేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని ఆధారాలు లభించాయి. విషయం తెలుసుకున్న టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఘటనాస్థలానికి వెళ్లి బాధితురాలు జయలక్ష్మి, ఆమె భర్త వద్ద వివరాలు ఆరా తీశారు. పోలీ జరిగిన నివసించే కరెంట్ కూడా తీసివేరాని ఆమె డీఎస్పీ వద్ద పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.



చోరీ జరిగిన తీరును డీఎస్పీ వివేకానందకు వివరిస్తున్న బాధితురాలు

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RACPC-1 (05251), పరిపాలన కార్యాలయం,బాలాజీనగర్, సీతమ్మధార జంక్షన్, విశాఖపట్నం - 530003

స్వాధీనత ప్రకటన
(రూల్-8(1) (ప్రకారం) (స్థిరాస్తులు కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC-1, విశాఖపట్నం జిల్లా యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుసంధిస్తూ రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలు: శ్రీ నాగేంద్ర కంటిమహంతి, డి.నెం.50-1-57/2/1, ఫ్లాట్ నెం.160, ఎపిఐఐసీ ఎస్.బి. లే అవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-530013. వీరికి చిరునామా: శ్రీ నాగేంద్ర కంటిమహంతి, డి.నెం.16-20-11, ఫ్లాట్ నెం.357, సాయిరామ్ లే అవుట్, పురుషోత్తమ నగర్ కాలనీ, ఫూరతికర్‌పేట గ్రామం, శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం జిల్లా. 2) శ్రీమతి కంటిమహంతి రాధిక, భర్త: శ్రీ నాగేంద్ర కంటిమహంతి, డి.నెం.50-1-57/2/1, ఫ్లాట్ నెం.160, ఎపిఐఐసీ నగర్, ఎస్.బి. లే అవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-530013. వేరొక చిరునామా: శ్రీమతి కంటిమహంతి రాధిక, భర్త: శ్రీ నాగేంద్ర కంటిమహంతి, డి.నెం.16-20-11, ఫ్లాట్ నెం.357, సాయిరామ్ లే అవుట్, పురుషోత్తమ నగర్ కాలనీ, ఫూరతికర్‌పేట గ్రామం, శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం జిల్లా వారు తేది. 29-06-2024 నాటికి రూ.1,63,61,773/- (అక్షరాల ఒక కోటి అరవై మూడు లక్షల అరవై ఒక్క వేల ఏడు వందల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే) + తేది.30-06-2024 నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ, ఖర్చులు, చార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది. 29-06-2024న డిమాండ్ నోటీస్ జారీ చేయబడినది.

రుణగ్రహీతలు సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుసంధిస్తూ సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారం దిగువ వివరించబడిన ఆస్తిని తేది. 04-09-2024న స్వాధీనం చేసుకోవడమైనది అని రుణగ్రహీతలకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తుల విషయమై ఎవరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనను తేది. 29-06-2024 నాటికి రూ.1,63,61,773/- (అక్షరాల ఒక కోటి అరవై మూడు లక్షల అరవై ఒక్క వేల ఏడు వందల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే) + తేది.30-06-2024 నుండి భవిష్య వడ్డీ, కాస్ట్సు మరియు ఇతర ఖర్చులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC-1, విశాఖపట్నం జిల్లా వారి ఛార్జికి లోబడి ఉండునని ప్రత్యేకించి రుణగ్రహీతలకు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి రుణగ్రహీత దృష్టి ఆకర్షించడమైనది.

స్థిరాస్తుల వివరములు

ఐటమ్ నెం.1: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం మున్సిపాలిటీ పరిధి, శ్రీకాకుళం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, ఫూరతికర్‌పేట గ్రామం, పురుషోత్తమ నగర్ కాలనీ, రెవెన్యూ వార్డు నెం.17, పాత సర్వే నెం.100 మరియు కొత్త సర్వే నెం.100/16లోని సాయిరామ్ లేఅవుట్ నందు ప్లాట్ నెం.357లో గల 373.33 చదరపు గజాల 312.15 చ.మీటర్లు స్థలం, అందు ఆసెస్‌మెంట్ నెం.1085017160, డి.నెం.16-20-11తో గల ఎల్లపుడే కన్‌స్ట్రక్షన్‌తో కూడిన భవనం, 1940.63 చ.అడుగులు నిర్మాణం అందువలన 1940.63 చ.అడుగులు స్థలం, శ్రీకాకుళం మండలం, తహసిల్దార్ వారిచే జారీచేయబడిన ఎండార్స్‌మెంట్ ఎల్.ఆర్.నెం.148/2016(ఆ), తేది.29.07.2016 ప్రకారం, ప్లాట్ నెం.357 సరిహద్దులు: తూర్పు: 30 అడుగుల రోడ్డు, పడమర: ప్లాట్ నెం.358 స్థలం, దక్షిణం: 75 అడుగుల రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.356 స్థలం, ప్లాట్ నెం.393 స్థలం.

ఐటమ్ నెం.2: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం మున్సిపాలిటీ పరిధి, శ్రీకాకుళం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, ఫూరతికర్‌పేట గ్రామం, పురుషోత్తమ నగర్ కాలనీ, రెవెన్యూ వార్డు నెం.17, పాత సర్వే నెం.100 మరియు కొత్త సర్వే నెం.100/16లోని సాయిరామ్ లేఅవుట్ నందు ప్లాట్ నెం.358లో గల 373.33 చదరపు గజాల 312.15 చ.మీటర్లు స్థలం, అందు 300 చదరపు గజాల నిర్మించిన ఆర్‌సీసీ, శ్రీకాకుళం మండలం, తహసిల్దార్ వారిచే జారీచేయబడిన ఎండార్స్‌మెంట్ ఎల్.ఆర్.నెం.148/2016(ఆ), తేది.29.07.2016 ప్రకారం. ప్లాట్ నెం.358 సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం.359 స్థలం, దక్షిణం: 75 అడుగుల రోడ్డు, పడమర: ఐటమ్ నెం.1లో వివరించిన ఆస్తి, ఉత్తరం: బి.వి.బి.నోవార్ వారి గల ప్లాట్ నెం.392 స్థలం.

తేది : 04-09-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : శ్రీకాకుళం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC-1, విశాఖపట్నం

సాక్షి క్లాసిఫైడ్స్

BUSINESS OFFER
■ ICF హార్టికల్చర్ అగ్రికల్చర్ బిజినెస్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రొఫెషనల్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీతం+ కమీషన్. ఫోన్ : 7015882322 [SCA-24000239]

WANTED
■ Wanted Male and Female work for MNC company Qul 10th to degree sal 15k to 25k Cont: 9502712418(Work from Home available) [G-9028]

■ హాస్పిటల్ హోమ్‌కేర్ విజయవాడ నందు వృద్ధుల, పేషెంట్లను,చంటిపిల్లలను చూసుకొనుటకు స్త్రీలు/పురుషులు కావలెను. జీతం+భోజనం. జీ: 18K. Ph: 9640528899, 9640648899 [H-796196]

■ హైదరాబాద్ కాపుVIPఇంట్లో పెద్దవాళ్లను చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్లు కావలెను. జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. 9182280297. [HA-98406]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటి నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించగలరు. మా పాఠకులను కోరడమేమనగా, ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.